సచిన్,అంజలి పెండ్లిలో మలుపులు

మాస్టర్ అత్త అన్నాబెల్ పుస్తకంలో వెల్లడి

ముంబై: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అంజలి పెండ్లి అనేక మలుపులు తిరుగాయని అతని అత్త అన్నాబెల్ తాను రాసిన 'మై ప్యాసెజ్ టు ఇండియా' అనే పుస్తకంలో ప్రస్తావించింది. ఇందులో పలు ఆసక్తికర అం శాలను ఆమె వెల్లడించింది. '1950 ప్రాంతంలో మా కుటుంబం ఇంగ్లండ్ నుంచి భారత్‌కు వచ్చింది. కొన్నేండ్లకు అంజలితో సచిన్‌కు పరిచయం ఏర్పడింది. కొద్ది రోజుల వ్యవధిలోనే అతను అంజలిని ప్రేమిస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయం మాట్లాడేందుకు సచిన్ మా ఇంటికి వచ్చాడు. అప్పుడు అతని వయస్సు 19 ఏండ్లు అనుకుంటా. అంజలి..పొడవాటి, అందమైన వ్యక్తిని పెండ్లి చేసుకుంటుదనుకున్నాం. కానీ వయసులో ఐదేండ్లు చిన్నవాడైన సచిన్‌తో వివాహానికి ఓకే అంటుందని అనుకోలేదు. అంజలి ఐదున్నర అడుగులు ఉంటుంది.. సచిన్ కూడా అంతే ఎత్తులో కనిపించాడు. ఇద్దరి ఎత్తులో పెద్ద తేడా లేదు. క్రికెటర్లు ప్లేబాయ్‌గా మారుతారనే ఆలోచన ఉండేది. కానీ సచిన్ విషయంలో అలా జరుగలేదు. వారి ప్రేమపై ఉన్న పవిత్రత అర్థం చేసుకున్నాం' అని రాసుకొచ్చింది.

యూటీటీకి శ్రీజ దూరం

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ)కి స్టార్ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ దూరమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన శ్రీజ..తీవ్రమైన ఒత్తిడి కారణంగా యూటీటీలో ఆడటం లేదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 22 నుంచి చెన్నై వేదికగా యూటీటీ లీగ్ మొదలుకాబోతున్నది.

లాస్ ఏంజెల్స్‌లో కలుద్దాం!

ఒలింపిక్స్‌కు ఘనంగా పారిస్ వీడ్కోలు • అలరించిన కళాకారుల విన్యాసాలు • ప్రత్యేక ఆకర్షణగా టామ్ క్రూజ్

విశ్వక్రీడల చరిత్రలో మునుపెన్నడూ చూడని విధంగా ప్రఖ్యాత సీన్ నది తీరం వెంబడి, ఆరుబయట ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టి ప్రపంచాన్ని ఆబ్బురపరిచిన 'పారిస్'.. ముగింపు వేడుకలనూ అదే స్థాయిలో నిర్వహించింది. గత నెల 25న అట్టహాసంగా మొదలైన ఒలింపిక్స్‌కు ఆదివారం (ఆగస్టు 11)తో తెరపడింది. స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మ్యూజిషియన్లు, కండ్లు మిరుమిట్లుగొలిపే లైటింగ్ షో, హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ విన్యాసాలు, కళాకారుల కళారూపాలు వెరసి 17 రోజుల పాటు సాగిన ఒలింపిక్స్‌కు ఫ్యాషన్ నగరి ఘనంగా వీడ్కోలు పలికింది. 2028 ఎడిషన్‌కు హాలీవుడ్ అడ్డా లాస్ ఏంజెల్స్ ముస్తాబవుతోంది.

పారిస్: నాలుగేండ్లకోసారి వచ్చే ప్రపంచ అతిపెద్ద క్రీడా పండుగ ముగిసింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా 17 రోజుల పాటు క్రీడాభిమానులను అలరించిన ఒలింపిక్స్‌కు ఆదివారంతో తెరపడింది. ఒలింపిక్ చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా సీన్ నదిలో ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించి 'ఔరా' అనిపించిన పారిస్.. ముగింపు వేడుకలనూ అదే స్థాయిలో మురిపించింది. ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు మొదలైన ఈ వేడుకలు అభిమానులను ఉర్రూతలూగించాయి. సుమారు 80వేల మంది హాజరైన ఈ ముగింపు కార్యక్రమంలో 270 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో అభిమానులను అలరించారు.

లియోన్ మర్చండ్‌తో మొదలై..

ఫ్రాన్స్ స్విమ్మింగ్ సంచలనం తాజా ఒలింపిక్స్‌లో ఏకంగా నాలుగు స్వర్ణాలు గెలిచిన లియోన్ మర్చండ్ వేదికపైకి ఒలింపిక్ జ్యోతిని తీసుకురావడంతో ఈ కార్యక్రమం మొదలైంది. అనంతరం ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయల్ మాక్రన్ అభిమానులకు అభివాదం చేసి అథ్లెట్ల పరేడ్‌ను ప్రారంభించారు. భారత పతాకధారులుగా మను భాకర్, పీఆర్ శ్రీజేష్ వ్యవహరించారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన లైటింగ్ షో అభిమానులను కట్టిపడేసింది. ఫ్రెంచ్ బాండ్ ఫోనెక్స్, యూఎస్ గాయని హెచ్. ఈ.ఆర్ తమ పాటలతో జోష్‌ను పెంచారు.

టామ్ క్రూజ్ విన్యాసాలు

ముగింపు వేడుకల్లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. 'మిషన్ ఇంపాజిబుల్'లో అతడు చేసినట్టుగా స్టేడియం పైనుంచి వైర్ సాయంతో గాల్లో చేసిన విన్యాసాలకు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం పారిస్ మేయర్ అన్నె హిడల్గొ ఒలింపిక్ జెండాను థామస్ బాచ్‌కు ఇవ్వగా ఆయన లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బస్‌కు పాస్ అందజేయడంతో ఆ నగరంలో ఒలింపిక్ సందడి మొదలైంది.

బరువు బాధ్యత అథ్లెట్లు, కోచ్‌లదే

వినేశ్ ఫోగాట్ వివాదంపై ఐవోఏ చీఫ్ పీటీ ఉష వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువుతో అనర్హత వేటుకు గురైన స్టార్ వినేశ్ ఫోగాట్ వివాదం చిలికి చిలికి గాలివానలా మారుతూనే ఉన్నది. వినేశ్ బరువు విషయంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ దిన్సా పార్దివాలాను తప్పుపడుతున్న వేళ..జాతీయ ఒలింపిక్ అసోసియేషన్(ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష తీవ్ర స్థాయిలో స్పందించింది. బరువు బాధ్యత అనేది అథ్లెట్లు, కోచ్‌లు చూసుకోవాల్సిందని, ఇందులో డాక్టర్ల ప్రమేయం ఏమి లేదని స్పష్టం చేసింది. 'రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో లాంటి వెయిట్ మేనేజ్‌మెంట్ క్రీడల్లో బరువు నిర్దేశిత స్థాయిలో ఉన్నది చూసుకోవాల్సింది అథ్లెట్లు, కోచ్‌లు మాత్రమే. ఏదైనా గాయాలైతే వైద్యులు చికిత్స అందిస్తారు తప్ప.. బరువు విషయంలో వారికి ఎలాంటి పాత్ర ఉండదు' అని పేర్కొంది. 100 గ్రాముల అధిక బరువుతో వినేశ్ తాను పోటీలో ఉన్న 50కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్‌కు అర్హత కోల్పయిన సంగతి తెలిసిందే.

ఈ కారణాల వల్లే..

వినేశ్ ఫోగాట్ అనర్హత వేటుకు గురి కావడంపై ఆమె లీగల్ టీమ్ పలు కారణాలను అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(సీఎస్ఏ) ముందుకు తీసుకువచ్చింది. 'అథ్లెటిక్స్ విలేజ్ నుంచి రెజ్లింగ్ పోటీలకు వేదికైన చాంప్ డీ మార్స్ ఎరీనాకు చాలా దూరం ఉంది. దీని వల్ల సరైన టైమ్‌లో బరువు తగ్గించుకోలేకపోయింది. దీనికి తోడు బౌట్‌ల మధ్య సరైన సమయం లేకపోవడంతో బరువు తగ్గించుకునేందుకు చాన్స్ లభించలేదు. అయినా శరీర బరువులో 100 గ్రాములు అంటే చాలా తక్కువ. ఉక్కపోత, వేసవి వాతావరణ నుంచి తట్టుకునేందుకు శరీరానికి నీరు అవసరమవుతుంది. ఒకే రోజు మూడు పోటీల్లో తలపడటం వల్ల మజిల్ మాస్ పెరుగుతుంది. బౌట్ ముగిసిన తర్వాత ఆహారం తీసుకోవాల్సి వస్తుంది' అని పేర్కొంది.

వినేశ్ కేసు తీర్పు నేడు

మంగళవారం ఫోగాట్ కేసులో సీఏఎస్ తీర్పు వెలువడే అవకాశాలు ఉన్నాయి. వినేశ్ తరపున ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపిస్తున్నారు.

'ప్రేమ నగరి' గుర్తుగా

'సిటీ ఆఫ్ లవ్'గా పిలుచుకునే పారిస్‌లో ఒలింపిక్స్ ఆడేందుకు వచ్చిన పలువురు క్రీడాకారులు ఆటలతో పాటు తమ జీవిత భాగస్వాములనూ కలుసుకున్నారు. 'ప్రేమ నగరి'లో 8 జంటలు తమ ప్రేమను వ్యక్తపరచడమూ ఒక రికార్డే. ఫ్రాన్స్ అథ్లెట్ అలీస్ ఫినొట్, ఇటలీ జిమ్నాస్ట్ అలీస్సా, బ్రెజిల్ ట్రిపుల్ జంపర్ అల్మిర్, అమెరికా షాట్ పుటర్ పేటన్, అర్జెంటీనా హ్యాండ్‌బాల్ టీమ్ మెంబర్ పాబ్లో సిమెనెట్, యూఎస్ఏ రోయింగ్ గోల్డ్ మెడల్ విన్నర్ జస్టిన్ బెస్ట్, బ్యాడ్మింటన్ ప్లేయర్లు యా కియోంగ్, లి యుచెన్.. పారిస్ వేదికగా వెడ్డింగ్ రింగ్‌లు ధరించాయి.

దులీప్ ట్రోఫీలో స్టార్ క్రికెటర్లు

బంగ్లాతో సిరీస్‌కు టీమ్‌ఇండియా సన్నాహకాలు

బెంగళూరు: దేశవాళీలో ప్రతిష్టాత్మక టోర్నీ అయిన దులీప్ ట్రోఫీలో టీమ్‌ఇండియాకు ఆడే అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లు పాలుపంచుకోనున్నారు. వచ్చే నెల 19 నుంచి స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెటర్లకు ఇది మంచి సన్నాహకంగా ఉపయోగపడుతుందని బోర్డు భావిస్తున్న తరుణంలో రోహిత్, కోహ్లీ, అశ్విన్, బుమ్రా, జడేజా, అక్షర్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్ వంటి స్టార్లు దులీప్ ట్రోఫీ ఆడనున్నట్టు సమాచారం. ఈ మేరకు భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతం గంభీర్ సైతం ఆటగాళ్లకు అల్టిమేటం జారీ చేసినట్టు బోర్డు వర్గాల ద్వారా తెలుస్తోంది. సెప్టెంబర్ 5 నుంచి 22 మధ్య జరుగబోయే దులీప్ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌లకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యమివ్వనుంది.

థోర్పది ఆత్మహత్య!

సంచలన విషయాలు వెల్లడించిన భార్య

లండన్: ఇటీవలే మరణించిన ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహం థోర్పది సహజ మరణం కాదని, బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆయన భార్య అమంద వెల్లడించింది.అమంద మాట్లాడుతూ..'గత కొన్నేండ్లుగా గ్రాహం తీవ్ర ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్నాడు. గతంలో 2022 మేలో ఒకసారి ఆత్మహత్యకు యత్నించాడు. అప్పుడు చాలా రోజులు ఐసీయూలో ఉండి ప్రాణాలతో బయటపడ్డాడు. అయినా ఆ యన డిప్రెషన్ నుంచి బయటకు రాలేకపోయాడు. కుటుంబంగా మేం ఆయనకు ఎంతో అండగా నిలిచాం. మెరుగైన చికిత్సను అం దించాం. రెండేండ్ల నుంచి మానసిక కుంగుబాటులో కూరుకుపోయిన ఆయన ఆ బాధ నుంచి బయటపడలేక పోయారు' అని తెలిపింది.

హెచ్‌సీఏ వుమెన్స్ టీ10 లీగ్ షురూ

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) చరిత్రలో తొలిసారి మహిళా క్రికెటర్ల కోసం వుమెన్స్ టీ10 లీగ్‌ను ప్రారంభించినట్లు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన వుమెన్స్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.